

గురుభ్యోనమః

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం పండుగ వాతావరణంలో గురువారం జరిగింది.ఆదర్శ గురువుగా పేరొందిన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని రంగులతో, పూలతో అలంకరించి, హ్యాపీ టీచర్స్ డే అంటూ ఆంగ్ల అక్షరక్రమంలో కొవ్వొత్తులను వెలిగించి నివాళి అర్పించడం ఆకట్టుకుంది. సర్వేపల్లి గొప్పదనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు విశదీకరించారు. హెచ్ఎం నాదమునిరెడ్డి, ఎంఈవో నమఃశివాయ,ఉపాధ్యాయులు సోమసుందరం పిళ్లై, సరస్వతి, మాలతి, కళైవాణి, బొజ్జారాములు, ఢిల్లీబాబు, వ్యాయామ సంచాలకులు కిషోర్‌కుమార్, రంజిత్‌కుమార్, సీఆర్పీ కార్తీక్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీకి 70 మంది అనర్హులు

వెరిఫికేషన్ కమిటీల నిర్ధారణ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 70 మంది అనర్హులయ్యారు. డీఎస్సీ మెరిట్ జాబితా అనుగుణంగా గత నెల 28 నుంచి చిత్తూరులోని ఎస్వీసెట్, అపోలో ఇంజనీరింగ్ కళాశాలల్లో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పలు దఫాలుగా సాగింది. తొలి విడతలో 1200 మంది అభ్యర్థులు, మలి విడతలో 278 మంది అభ్యర్థులు కాగా, వీరిలో వివిధ కారణాలతో గైర్హాజరైన 45 మందికి మూడో విడతలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన సాగింది. ఆపై పూర్తిగా హాజరుకాని వారి జాబితా అధారంగా తదుపరి మెరిట్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేశారు. వీరితో పాటు దివ్యాంగుల కేటగిరిలోని అభ్యర్థులకు సైతం తిరుపతిలోని రుయా రెఫరెల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షల నిర్వహణ ప్రక్రియ పూర్తి చేశారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి కావడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 183 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా లేకపోవడం, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వివరాల్లో తేడాలు రావడం, ఇతర కారణాలతో అర్హత కోల్పోయినట్లు వెరిఫికేషన్ కమిటీలు నిర్ధారించాయి.183మంది అభ్యర్థులు ఒకటికిపైగా పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. రిపీటెడ్ కౌంట్‌ను తొలగించగా, చివరకు 70మంది అభ్యర్థులు తేలారు. దీంతో వీరి స్థానంలో మెరిట్ జాబితాలోని తదుపరి 70 మందికి రాష్ట్ర విద్యాశాఖ వెరిఫికేషన్ కాల్ లెటర్లు పంపనుంది.రాగానే ఈఅభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేస్తారు. మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి, ఈనెల 10వ తేదీ నాటికి మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.



నీటితో నిండుకుండలా తొణికిసలాడుతున్న పరమ సముద్రం చెరువు



మొరవ నీళ్లలో స్థానికుల సంతోషం

పరమసముద్రం చెరువు నిండి మొరవ పారింది!

● హంద్రీనీవా కాలువలో ఉరకలెత్తుతున్న కృష్ణా జలాలు



ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

కుప్పం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):హంద్రీనీవా కాలువలో ఉరకలెత్తి వస్తున్న కృష్ణా జలాలతో గురువారం సాయంత్రానికి పరమసముద్రం చెరువు నిండి మొరవ పారింది.హంద్రీనీవా కాలువ ఎండిపోయిందంటూ జరిగిన తప్పుడు ప్రచారాలను తుత్తునియలు చేస్తూ మొరవ నీళ్లు వీరప్పనాయుని చెరువువైపు వడివడిగా సాగుతున్నాయి.రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పంలో ప్రవేశించిన కృష్ణమ్మ.. శాంతిపురం, గుడుపల్లె మండలాల మీదుగా పరమసముద్రం చెరువును చేరింది.ఇక్కడినుంచి వీరప్పనాయని చెరువువైపు ఉరకలెత్తి ప్రవహిస్తోంది.పరమసముద్రం చెరువు నిండిపోయిందని, ఈ చెరువుకున్న రెండు మొరవలు ఏ క్షణమైనా పారవచ్చని ముందుగానే తెలియడంతో గురువారం ఉదయంనుంచి పరిసర గ్రామాల ప్రజలు పిల్లాపాపలతో తరలివచ్చారు. కొందరు వస్తావస్తా కోళ్లను పట్టుకుని వచ్చారు. మధ్యాహ్నా సమయానికి కృష్ణా జలాలతో నిండుగా తొణికిసలాడిన పరమసముద్రం చెరువు, సాయంత్రానికి చివరనున్న మొరవ గుండా పారింది. ఈ క్షణంకోసం ఉగ్గబట్టుకుని కళ్లకాయలు కాసేలా ఎదురుచూస్తున్న జనం.. కోళ్లను గావుఇచ్చి గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఇలాగే నిండుగా తమ బతుకులు పండించమంటూ మొక్కుకున్నారు.

మార్కెటింగ్ శాఖకు రూ.66.96 లక్షల ఆదాయం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖకు ఏఎంసీల ద్వారా ఆగస్టు నెలలో రూ.66.96 లక్షల ఆదాయం సమకూరినట్లు ఏడీ పరమేశ్వరన్ తెలిపారు. గురువారం ఆయన ఛాంబర్‌లో మాట్లాడుతూ అత్యధికంగా పలమనేరు ఏఎంసీ ద్వారా రూ.32.33 లక్షల ఆదాయం సమకూరగా, అత్యల్పంగా సోమల ఏఎంసీకి కేవలం రూ.33 వేలు మాత్రమే వచ్చింది. మిగిలిన ఏఎంసీల ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరుకు రూ.7.50 లక్షలు, పుంగనూరుకు రూ.7.89 లక్షలు, బంగారుపాళ్యంకు రూ.7.46 లక్షలు, నగరికి రూ.2.57 లక్షలు, కుప్పంకు రూ.6.25 లక్షలు, పెనుమూరుకు రూ.1.23 లక్షలు, రొంపిచెర్లకు రూ.89 వేలు, ఎస్ఆర్‌పురంకు రూ.61 వేలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

మెప్మా సీఎంఎం సరెండర్

చిత్తూరు, అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రమణను ఆశాఖ ఉన్నతాధికారులకు కమిషనరు నర్సింహప్రసాద్ గురువారం సరెండర్ చేశారు. విధుల్లో అలసత్వంతో పాటు వివిధ రకాల ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఏపీఈడబ్ల్యుఐడీసీ డైరెక్టర్‌గా వి.శ్రీనివాస్



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిత్తూరుకు చెందిన జనసేన నాయకుడు వుయ్యాల శ్రీనివాస్ నియమితులయ్యారు.జనసేన ఐటీ విభాగంలో అందించిన సేవలతో తనకు గుర్తింపు లభించిందన్న శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, జనసేన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



అశ్వవాహన సేవ



కన్నులపండువగా కల్యాణోత్సవం

● వరసిద్ధుడికి టీటీడీ తరఫున పట్టు వస్త్రాల సమర్పణ



స్వామికి గంధాభిషేకం నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక అలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వినాయకస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.బ్రహ్మ మానస పుత్రికలైన సిద్ధి, బుద్ధిలతో వినాయకస్వామికి పెళ్లిపెద్దగా బ్రహ్మ వ్యవహరించి వివాహం జరిపిస్తారని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. కాణిపాకం, తిరువణంపల్లెలకు చెందిన వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.

అనంతరం కాణిపాక పురవీధుల్లో కలశాలతో పాలను తీసుకొని ఊరేగించారు.అలాగే గోనగుంట బలిజ వంశస్థులు పాల కలశాలను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు.అనంతరం ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహించారు. రాత్రి అలంకార మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కల్యాణ మండప వేదికపైకి వధూవరులను తీసుకొచ్చి శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు.అనంతరం స్వామివారి ఊరేగింపులో భాగంగా గురువారం రాత్రి గంగుండ్రి మండపం వద్ద స్వామివారు దోపిడికి గురయ్యారు. బ్రహ్మోత్సవ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులో స్వామిని దోపిడీ చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా స్వామివారికి అత్తవారు కట్టించిన కుడుములు, ఉండ్రాళ్లు, చిల్లర కాసులను భక్తులు దోపిడీ చేశారు. ఈ తంతు ముగియగానే కొంత సేపు స్వామివారిని, సిద్ధి,బుద్ధిని గంగుండ్రి మండపం వద్ద ఉంచి విద్యుత్ దీపాలను తొలగించారు. అనంతరం విద్యుత్‌ను పునరుద్ధరించి స్వామి ఊరేగింపును కొనసాగించారు.అంతకుముందు కల్యాణోత్సవానికి టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు వరసిద్ధుడికి పట్టు వస్త్రాలను అందజేశారు.తరువాత కల్యాణం జరిపించడం కోసం గురువారం మధ్యాహ్నం ఆలయ సిబ్బంది శివపార్వతుల వేషధారణలో కాణిపాకం పుర వీధుల్లో భిక్షాటన నిర్వహించారు. యాత్రికులు, భక్తులు తోచినది భిక్షగా వేశారు.ఈ కార్యక్రమాల్లో ఈవో పెంచల కిషోర్,ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, ఆలయ మాజీ చైర్మన్లు మణినాయుడు,జగన్నాథరెడ్డి,మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై విహారం

వరసిద్ధుడు గురువారం రాత్రి అశ్వ వాహనంపై విహరిస్తూ భక్త జనులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లెలకు చెందిన గొనగుంట బలిజ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.ఉభయ వరస తీసుకురావడంతో అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను అశ్వ వాహనంపై ఉంచి మంగళ వాయిద్యాలు మధ్య ఊరేగించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ధ్వజావరోహణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.రాత్రి వడాయత్తు ఉత్సవం,ఏకాంత సేవ నిర్వహించనున్నారు.



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు తదితరులు



భిక్షాండికి బయలుదేరుతున్న ఈవో పెంచలకిషోర్,ఆలయ సిబ్బంది,గ్రామస్తులు


త్వరలో జిల్లాకు 2500 టన్నుల యూరియా

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతర యూరియా సరఫరాను ప్రభుత్వం కొనసాగిస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1500 టన్నుల యూరియా నిల్వలు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. త్వరలో 2500 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, ఇప్పటికే రైతుల వద్ద మరో 2600 టన్నుల నిల్వ ఉన్నాయన్నారు. రైతులు తప్పనిసరిగా వేలి ముద్రలు నమోదు చేసి ఆధార్ అధీకృత విధానం ద్వారా యూరియాను కొనుగోలు చేయాలన్నారు. చాలా చోట్ల రైతులు పశుగ్రాసం కోసం మోతాదుకు మించి యూరియాను వినియోగిస్తున్నారని, ఈ అలవాట్లు తగ్గించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియాను అందుబాటులోకి తెస్తున్నామని, ముందస్తుగా అధిక ధరలకు కొనుగోలు చేయొద్దని కలెక్టర్ విజ్ఞప్తిచేశారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మితే మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని, వారిపై ఎరువుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకోసం చిత్తూరులో కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 8331057732 లేదా 8331057741 ఫోన్ నెంబర్లకు రైతులు ఫిర్యాదు చేయాలని, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, నగరి డివిజన్లలో సైతం కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమయానుకూలంగా యూరియా అందుతోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలకు ఎన్ఆర్ఎఫ్ ర్యాంకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీకి ర్యాంకులు దక్కాయి. ఎస్వీయూకు 47వ ర్యాంకు, పద్మావతి మహిళా యూనివర్సిటీకి 60వ ర్యాంకు దక్కింది. బోధన, పరిశోధన, విస్తరణ తదితర రంగాల్లో ఈ వర్సిటీల విశేష కృషికి గుర్తింపుగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ర్యాంకు రావడం పట్ల ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని హర్షం వ్యక్తం చేశారు.


కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో హెడ్ ఆఫ్ బ్రాండ్స్‌గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాథిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర
నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్
ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

కీటక జనిత వ్యాధులపై
ముందస్తు ప్రణాళికలు అవసరం

● ఫ్యామిలీ వెల్ఫేర్ స్టేట్ కమిషనర్ వీరపాండ్యన్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం రానుందని.. కీటక జనిత వ్యాధులపై ముందస్తు ప్రణాళికలు అవసరమని ఫ్యామిలీ వెల్ఫేర్ స్టేట్ కమిషనర్ వీరపాండ్యన్ అన్నారు. గురువారం విజయవాడ నుంచి డీఎంహెచ్‌వోతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కీటకాల వ్యాప్తితోపాటు నీటి కలుషితం ఎక్కువగా ఉంటుందని, వాటి నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా వచ్చిన ప్రాంతాల్లో వెంటనే మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మాతాశిశు మరణాలు సంభవించకుండా ఉండాలంటే గర్భందాల్చిన నాటి నుంచే వారిపేర్లను ఆన్‌లైన్‌లో నమోదుచేసి పర్యవేక్షించాలన్నారు. క్రమం తప్పకుండా ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయాలన్నారు. కాన్పులు ప్రభుత్వం ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలన్నారు. హైరిస్క్ కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి డెలివరి డేట్‌కు వారం రోజుల ముందే ప్రభుత్వాస్పత్రిలో చేర్పించాలని ఆదేశించారు. లింగనిర్ధారణపై నిఘా పెట్టాలని, స్కానింగ్ కేంద్రాలను నిరంతరం తనిఖీలు చేస్తుండాలని ఆయన తెలిపారు. ఎస్‌సీడీ 4.0ను క్వాలిటీగా నిర్వహించాలని ఆదేశించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంకేసిన కోడెగిత్తలు

ఎగువపాతపాళ్యంలో కోలాహలంగా జల్లికట్టు


జల్లికట్టులో పరుగులు పెడుతున్న వృషభం

యాదమరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపాతపాళ్యంలో గురువారం టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు విజయేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో కోలాహలంగా జల్లికట్టు నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 300 ఎద్దులకు పైగా జల్లికట్టులో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఎద్దులను నిలువరించేందుకు యువకులు పెద్దఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రం లత్తేరి బాబుకు చెందిన ఎద్దు మొదటి స్థానంలో నిలిచి రూ.లక్ష బహుమతిని గెలుపొందగా, మిగిలిన పోటీల్లో గెలుపొందిన వాటికి గ్రామస్థులు బహుమతులు అందజేశారు.

కూటమి ప్రభుత్వంలోనే
గ్రామీణ రోడ్లకు మహర్దశ

● ఎమ్మెల్యే భానుప్రకాష్


తారు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ కలిగిందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం నింద్ర మండలంలోని అత్తూరు పంచాయతీలో అత్తూరు నుంచి అగరంపేట వరకు రూ.కోటి 60లక్షలు ఉపాధి నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలో సిమెంటు రోడ్లు, తారు రోడ్లు, తాగునీటి సౌకర్యంకోసం సుమారు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సుబ్బరాయుడు, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వరరావు, సర్పంచ్ మలర్వాణి, నాయకులు రవి నాయుడు, దినేష్, గిరిబాబు, గాలి రమేష్ నాయుడు, విజయకుమార్, పురుషోత్తం నాయుడు, లోకేష్, కాటయ్య, మురళీనాయుడు, బాబుయాదవ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో...




కాణిపాకంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు నిర్వహించే పాలాభిషేకం కోసం గురువారం పాల కలశాలను తీసుకొస్తున్న బలిజ కులస్థులు, వణిగ వంశస్థులు, పాల కలశాల ఊరేగింపులో ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు

అట్టహాసంగా పెనుమూరు ఏఎంసీ ప్రమాణస్వీకారం

● హాజరైన ఎమ్మెల్యేలు థామస్, గురజాల


ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

పెనుమూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెనుమూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం గురువారం పెనుమూరులో అట్టహాసంగా జరిగింది. పెనుమూరు చెక్‌పోస్టు నుంచి ర్యాలీగా బస్టాండు, శివాలయం మీదుగా బైపాస్ ద్వారా మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. బస్టాండులో క్రేన్‌తో వేసిన గజమాల ఆకట్టుకుంది. మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జీడీనెల్లూరు, చిత్తూరు ఎమ్మెల్యేలు థామస్, గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అశేష జనవాహిని పాల్గొని సభను విజయవంతం చేశారు. థామస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓన్లీ సెలక్షన్ మాత్రమే ఉండాలని, అందుకు కూటమి నాయకులు కలిసికట్టుగా నిలబడాలని అన్నారు. గురజాల మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో అమరావతి, పోలవరం పరుగులు పెడుతున్నాయని, కృష్ణా జలాలు కుప్పానికి తీసుకువచ్చి చరిత్ర సృష్టించారని అన్నారు. అనంతరం చైర్మన్ కృష్ణమ నాయుడు, వైస్ చైర్మన్ అరుల్‌నాథన్, డైరెక్టర్లు ప్రసాద్ రెడ్డి, చారుమతి, భార్గవి, సుబ్రమణ్యం నాయుడు, లోకమ్మ, దేవరాజు, కోదండ రెడ్డి, నియాజ్, గ్రీష్మ, అరుణ, రేణుక, జ్యోతి, శ్యామలతో ఎమ్మెల్యే థామస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు సీఆర్‌రాజన్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, సీనియర్ టీడీపీ నేత చంద్రప్రకాష్, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథ నాయుడు, పెనుమూరు మండలాధ్యక్షులు రుద్రయ్య నాయుడు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, రాష్ట్ర పొల్యూషన్ సంస్థ డైరెక్టర్ నాగేశ్వర్‌రాజు, జిల్లా కార్యదర్శి తలారి రెడ్డెప్ప, జిల్లా యాదవసాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పెనుమూరు మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి నాయుడు, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, జీడీనెల్లూరు మండలాధ్యక్షులు లోకనాథరెడ్డి, జయశంకర్ నాయుడు, చెంగల్రాయ యాదవ్, స్వామిదాస్, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షులు రాజేంద్రన్, నాయకులు యాగమ నాయుడు, భాస్కర్, చిరంజీవిరెడ్డి, అశోక్, శ్రీనివాసచౌదరి, ఏకాంబరం, యువరాజులు నాయుడు, కిషోర్ నాయుడు, గంగాధరం, రాజగోపాల్ నాయుడు, శివశంకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యం



కార్వేటినగరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యమని, అందరూ సమన్వయంతో కలసి పని చేయాలని కార్వేటినగరం ఎంపీపీ లత పిలుపునిచ్చారు. గురువారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ సభ్యులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని గోపిశెట్టిపల్లి ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య సభ దృష్టికి తెచ్చారు. అల్లాగుంటలో తాగునీటి సమస్య ఉందని, బోరు కూడా మంజూరైందని, అనుమతులిస్తే డ్రిల్లింగ్ చేసుకుంటామని అక్కడి సర్పంచ్ సుందరరాజు తెలిపారు. ఎంపీపీ స్పందిస్తూ వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎంపీడీవో చంద్రమౌళిని ఆదేశించారు.గాజంకి, జాండ్లపేట మార్గంలో అక్కడక్కడ బీటీరోడ్డు సక్రమంగా లేని కారణంగా రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయని కేపీ అగ్రహారం సర్పంచ్ శేఖర్‌రెడ్డి ఆరోపించారు. పలు సమస్యపై సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం


కుంభాభిషేకానికి హాజరైన ఎమ్మెల్యే థామస్

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం డి.కె.మర్రిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ మహా కుంభాభిషేకం కార్యక్రమానికి గురువారం గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. విగ్రహాలు, కుంభాభిషేకం దాతలుగా మహేశ్వరి, నవీన్ వ్యవహరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు, బలగాల బాబునాయుడు,బాబు, ప్రకాష్, కోటేశ్వరరావు, పెరుమాళ్, నరేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మిలాద్ ఉన్ నబీ పండుగ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముస్లింల పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ పండుగను శుక్రవారం నిర్వహించుకోనున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం సోదరులు ఉపవాసం చేసి తమ పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. స్థానిక పెద్దమసీదు నుంచి ప్రవక్త కేశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అసార్‌వీధిలోని చిన్నమసీదులో 5, 6 తేదీల్లో ముస్లిం భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

బొమ్మల సాయంతో బోధన





హేమలత

పుంగనూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణం రాంనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న హేమలత ఎమ్మెస్సీ బోటనీ చదివారు.పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమయ్యేందుకు ఆటపాటలు, కథలు, గేయాలు, బొమ్మల సాయంతో బోధిస్తారు.బట్టీ పద్ధతి లేకుండా, బెత్తం వాడకుండా ఫ్రెండ్లీ నేచర్‌తో పాఠాలు చెప్పడం ద్వారా పిల్లలు క్రమశిక్షణతో వింటూ మంచి అవగాహన తెచ్చుకుంటున్నారు.విద్యార్థులకు ఏ అంశాన్నైనా చైల్డ్‌సెంట్రిక్ పద్ధతిలో నేర్పించడం, అర్థమయ్యేరీతిలో సొంతమాటల్లో చెప్పడంతో పిల్లలు పాఠశాల అంటే ఇష్టపడతారనేది ఆమె భావన.బడికి పోకపోతే ఆటపాటలు మిస్ అవుతామని 100 శాతం హాజరవుతున్నారని హేమలత చెప్పారు. పిల్లల కోసం బొమ్మలు, కథలు, ఆటలు, పాటలు, గేయాలు చెప్పడం వల్ల తనలో ఆసక్తి పెరిగి అనేక కథలు, గేయాలు, పుస్తకాలు రాయడంతో ప్రశంసలు కూడా వచ్చాయన్నారు.ఇదివరకే జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, స్పందన ఇంటర్నేషనల్ సెంటర్ ద్వారా గురుస్పందన అవార్డు, వే ఫౌండేషన్ ద్వారా సాహితీప్రవీణ అవార్డు లభించాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని భావిస్తున్నట్లు ఆమె చెప్పుకొచ్చారు.

ప్రతిభకు గుర్తింపు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈసారి జిల్లానుంచి ముగ్గురు ఎంపికయ్యారు. సెకండరీ గ్రేడ్ టీచర్ సి.హేమలత, స్కూల్ అసిస్టెంట్లు ఎస్.నౌషద్ ఆలీ, నౌజియా శుక్రవారం తాడేపల్లిలో విద్యాశాఖ నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డులు అందుకోనున్నారు.

అలవోకగా భౌతికశాస్త్రాన్ని నేర్పిస్తారు



గుడిపాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గుడిపాల మండల కేంద్రమైన నరహరిపేట జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నౌషాద్ అలీ గత 30 సంవత్సరాలుగా విద్యాశాఖలో అనేక కార్యక్రమాల నిర్వహణలో తన వంతు పాత్ర పోషించారు.జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సెమినార్లలో పాల్గొని పలువురి ప్రశంసలందుకున్నారు.సైన్స్, ఇన్‌స్పైర్ ప్రదర్శనల్లో తన విద్యార్థులతో అనేక భౌతిక శాస్త్ర పరిశోధనలు చేయించి బహుమతులు వచ్చేందుకు కృషి చేశారు.మిగిలిన సబ్జెక్టులతో పోలిస్తే కొంత కఠినంగా వుండే భౌతిక శాస్త్ర పాఠాలను పిల్లలకు అర్థమయ్యేలా విడమరిచి చెప్పడంలో సిద్ధహస్తుడిగా పేరుపొందారు. పుస్తక రచయితగా ఎన్నో పురస్కారాలు పొందారు.రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా సహచర ఉపాధ్యాయులంతా ఆయన్ను అభినందించారు.

వందశాతం ఉత్తీర్ణతకు పెట్టింది పేరు





పుంగనూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నక్కబండలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ టీచరుగా పని చేస్తున్న నౌజియా ఎంఏ బీఈడీ చేసి 2008లో ఉపాధ్యాయురాలిగా చేరారు. పుంగనూరు కేజీబీవీలో మాత్రమే ఉర్దూ మీడియం ఉండడంతో 15 ఏళ్లగా ఇక్కడే పని చేస్తున్నారు. ముస్లిం బాలికలకే కాకుండా ముస్లిమేతరులకు కూడా ఉర్దూ భాష నేర్పించారు.ఉర్దూ సబ్జెక్టులో ఇంతవరకు ఒక్కరు కూడా ఫెయిల్ కాలేదని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మైనార్టీ పాఠశాల అయినప్పటికీ ఇక్కడ 25 శాతం బాలికలు ముస్లిమేతరులు ఉండగా తమ సబ్జెక్టులో 95 మార్కులు సాధించినవారు కూడా ఉన్నారన్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధిస్తుండడం వల్లే విద్యార్థినులు కూడా ప్రత్యేక శ్రద్ధతో బాగా చదివి 100 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇప్పటికే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తనకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం చాలా ఆనందంగా వుందన్నారు.

నలుగురికి ఉత్తమ అధ్యాపక అవార్డులు



బి.శరశ్చంద్రశేఖర్

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులకు జిల్లాలో పలువురు ఎంపికయ్యారు. చిత్తూరు రూరల్ మండలం ఎన్‌ఆర్‌పేట జూనియర్ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడు బి.శరశ్చంద్రశేఖర్, కుప్పం ద్రవిడ యూనివర్శిటీ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఎం.దొరస్వామి, చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలోని ఉర్దూ అధ్యాపకులు మహమ్మద్ అన్వర్‌బాషా, నగరి డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు ఎం.భాస్కర్‌రాజు వీరిలో వున్నారు.శుక్రవారం తాడేపల్లిలో ఉన్నత విద్యామండలి నిర్వహించే గురుపూజోత్సవ కార్యక్రమంలో మంత్రుల చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

70మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 70 మందిని విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో విద్యాశాఖ - సమగ్ర శిక్ష సంయుక్తంగా శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు 70 మందికి మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించనున్నారు.

13 మంది వర్సిటీ అధ్యాపకులకూ..



వెంకటకృష్ణ





సి.భువనేశ్వరిదేవి - డి.సుబ్రమణ్యం





















టి.రమాశ్రీ, ఎం.బాలాజీ, పి.అఖిల స్వతంత్ర, టి.విజయ, వి.సుబ్బారావు, టి.చంద్రశేఖరయ్య, రమ్యా కుబేర్, ఎం.అరుణ, పి.జ్యోత్స్న, వైఎస్ శారద

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోధన, పరిశోధన, విస్తరణ, సేవ తదితర రంగాల్లో కృషికి గుర్తింపుగా తిరుపతిలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో 13 మంది ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు.

ఎస్వీ యూనివర్సిటీ: ప్రొఫెసర్లు టి.రమాశ్రీ (ఈసీఈ), ఎం.బాలాజీ (బయోకెమిస్ట్రీ), అఖిల స్వతంత్ర (మెకానికల్ ఇంజినీరింగ్), టి.విజయ (బోటనీ), టి.చంద్రశేఖరయ్య (పాపులేషన్ స్టడీస్), డి.సుబ్బారావు (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)

పద్మావతి యూనివర్సిటీ: ప్రొఫెసర్లు వైఎస్ శారద (ఇంగ్లీషు), ఎం.అరుణ (హోంసైన్స్), పెంచలనేని జ్యోత్స్న (బయో టెక్నాలజీ), పి.వెంకటకృష్ణ (కంప్యూటర్‌సైన్స్), రమ్యాకుబేర్ (ఫార్మసీ), పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరిదేవి (జువాలజీ)తో పాటు ఎస్వీ వ్యవసాయ కాలేజీలో డాక్టర్ డి. సుబ్రమణ్యం (అగ్రానమీ) కూడా పురస్కారానికి ఎంపికయ్యారు.

పల్లెల్లో నిఘా కోసమే ఫాల్కన్ వాహనం



మినీ ఫాల్కన్ వాహనానికి పూజలు చేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలు, బందోబస్తులు, లా అండ్ ఆర్డర్ సమయాల్లో మాత్రమే బస్సులాంటి ఫాల్కన్ వాహనాన్ని ఉపయోగించేవారమని, పల్లెల్లో, వీధుల్లో నిఘా ఉంచడం కోసం మినీ ఫాల్కన్ వాహనాన్ని తయారుచేశామని ఎస్పీ మణికంఠ తెలిపారు. గురువారం సాయుధదళ కార్యాలయంలో మినీ ఫాల్కన్ వాహనానికి పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అనేక గ్రామాల్లో జాతరలు, పండుగలు, ధర్నాలు, ర్యాలీలు జరుగుతుంటాయని, అలాంటి సమయాల్లో బస్సులాంటి ఫాల్కన్ వాహనాన్ని తీసుకెళ్లడం కష్టంగా ఉంటుందన్నారు. గ్రామాలను దృష్టిలో ఉంచుకుని ఒక వినూత్న పరిష్కారంగా మినీ ఫాల్కన్ వాహనాన్ని రూపొందించామన్నారు. ఈ వాహనంలో 360 డిగ్రీలో తిరిగే పీటీజెడ్ కెమెరా ఉంటుందని, అదనంగా రెండు పక్కలా ఫిక్స్‌డ్ కెమెరాలు ఉంటాయన్నారు. ఈ కెమెరాలతో పరిసర ప్రాంతాలన్నింటినీ కవర్ చేయవచ్చన్నారు. దొంగతనాలు, ఈవ్‌టీజింగ్ వంటి సంఘటనలను పర్యవేక్షించడంలో, ముఖ్యమైన వ్యక్తులు పాల్గొనే ర్యాలీలు, ధర్నాల సమయంలో నేర నియంత్రణకు ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. పోలీసుశాఖ వద్ద ఉన్న వాహనాన్ని మార్పులు చేసి ఆమ్‌యాక్ట్ సంస్థ రూపొందించిందన్నారు. అనంతరం ఆమ్‌యాక్ట్ సంస్థ చైర్మన్ దశరథరెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ వాహనంలో కొద్ది దూరం ప్రయాణించారు.ఏఎస్పీలు రాజశేఖర రాజు, శివానంద కిశోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాష, సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య, ఎస్బీ సీఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఐదేళ్ల జైలు, జరిమానా



నిందితుడు మహేంద్ర

వెదురుకుప్పం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో నిందితుడు మహేంద్ర(48)కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి స్పెషల్ రెడ్ శాండల్ కోర్టు జడ్జి ఎ.నరసింహమూర్తి తీర్పు ఇచ్చారు. వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం-తిరుపతి రోడ్డులో రాత్రి వాహనాల తనిఖీ సందర్భంగా 2018వ సంవత్సరంలో పట్టుబడిన మహేంద్ర ఈ రవాణా వెనుక మురళీశేఖర్, వెలన్, భాస్కర్, వెంకటేశులు, దేవకుమార్ ఉన్నారని చెప్పాడు.వీరిలో మురళీశేఖర్, వెంకటేశులును కూడా అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండు విధించారు. గురువారం కేసు విచారణకు రాగా తిరుపతి ప్రత్యేక ఎర్రచందనం కేసుల న్యాయస్థానం జడ్జి ఎ.నరసింహమూర్తి ముద్దాయి మహేంద్రకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3లక్షల జరిమానా విధించారు.వెంకటేశులును నిర్దోషిగా పరిగణించి విడుదల చేయగా, మురళీశేఖర్ విచారణ సమయంలో మరణించడంతో కేసు నుంచి మినహాయించారు. సత్యవేడు మండలం రాజుగుంట గ్రామానికి చెందిన ఎస్.మహేంద్రకు శిక్ష పడేందుకు కృషి చేసిన అప్పటి వెదురుకుప్పం ఎస్‌ఐ రామకృష్ణ,కానిస్టేబుల్ గురుస్వామి, కోర్టు పీపీ అమరనారాయణ, మానిటరింగ్ సెల్ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టరు చంద్రశేఖర్, కానిస్టేబుల్ హరిప్రసాద్ తదితరులను ఎస్పీ మణికంఠ గురువారం అభినందించారు.

స్వామిత్వ సర్వే తనిఖీ



గొల్లపల్లెలో ఓ ఇంటి యజమానితో మాట్లాడుతున్న డీపీవో సుధాకరరావు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లె గ్రామంలో సచివాలయ ఉద్యోగులు స్వామిత్వ సర్వే నిర్వహిస్తుండగా గురువారం జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు తనిఖీచేశారు. అక్కడ సర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగుల వద్ద వివరాలు తెలుసుకుని, అనంతరం ఇంటి యాజమానితో మాట్లాడారు. స్వామిత్వ సర్వే కార్యక్రమానికి గ్రామస్థులు సహకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పెద్దకాల్వ, ముక్కళత్తూరు, బంగారెడ్డిపల్లె పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యుపీసీ కేంద్రాల నిర్వహణను డీఎల్‌పీవో రవికుమార్ తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లోకేష్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో శివయ్య, డీపీఆర్‌సీ రీసోర్సుపర్సన్ గజేంద్ర, పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, సింధు, కుమార్ పాల్గొన్నారు.

నాటుకోళ్ల ఫారంపై వీధికుక్కల దాడి

● 323 కోళ్లు చనిపోవడంతో రూ.3.50లక్షల నష్టం



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు పంచాయతీ పి.బి. అగ్రహారం గ్రామంలోని నాటుకోళ్ల ఫారంలో వీధికుక్కలు దూరేసి 323 నాటుకోళ్లను చంపేసిన వైనం గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధిత రైతుబలరామ్, గ్రామస్థుల సమాచారం మేరకు... గురువారం సాయంత్రం ఈ ఫారంలోకి ఉన్నట్టుండి వీధికుక్కలు దూరేసి నాటుకోళ్లపై స్వైర విహారం చేశాయి. కుక్కల దాడిలో 323 నాటుకోళ్లు మృతిచెందడంతో వాటి విలువ సుమారు రూ.3.50 లక్షల మేర ఉంటుందని పేర్కొంటూ రైతు బలరామ్ ఒక్కసారిగా కుదేలు అయ్యారు. పి.బి.అగ్రహారం గ్రామంలో వీధికుక్కలు ఎక్కువై ఇటీవల మనుషులపై దాడులుచేసి గాయపరుస్తున్నాయని, వాటిని నియంత్రించాలని ఆ రైతు వేడుకున్నారు.

చిరుత దాడిలో పాడి ఆవు మృతి



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో ప్రభాకర్

చౌడేపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిరుత పులి దాడిలో పాడి ఆవు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని పరికిదొన పంచాయతీకి చెందిన హరి బుధవారం గ్రామ సమీపంలోని మొడుకూరు అటవీ ప్రాంతంలో ఆవులను మేతకు తోలాడు. సాయంత్రం ఓ పాడి ఆవు కనిపించకపోవడంతో వెతికి ఇంటికి వచ్చేశాడు. గురువారం ఉదయం మొడుకూరు సమీపంలోని క్వారీ వద్ద పాడి ఆవు కళేబరం కనిపించింది. పులి దాడి చేసి చంపేసినట్లు గుర్తించి ఎఫ్‌బీవో ప్రభాకర్‌కు సమాచారం అందించారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి చిరుత దాడి చేసిందని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన మురళి

కల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు-సదుం రోడ్డులోని పాతపేట మలుపు వద్ద గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు... చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లి పంచాయతీ పి.కొత్తూరు ఎస్టీ కాలనీకి చెందిన మురళీ (43), తన సమీప బంధువు శరవణకుమార్ (36)తో కలిసి గురువారం ఉదయం ద్విచక్రవాహనంలో పులిచెర్ల మండలం పాతపేటలోని పెద్దమ్మ రుక్మిణి ఇంటికి వచ్చారు. అక్కడ పనులు ముగించుకొని పెద్దమ్మ ఇంటి వద్ద ఉన్న తన కుమార్తె అనుష్క (15), శరవణకుమార్‌తో కలిసి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు-సదుం రోడ్డులోని పాతపేట మలుపు వద్ద కల్లూరు నుంచి సదుం వైపునకు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో మురళి అక్కడికక్కడే మృతిచెందగా... అనుష్క, శరవణకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం, మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెస్కో పాలకమండలి ప్రమాణ స్వీకారం



రెస్కో చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న ప్రతాప్‌తో సభ్యులు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, మునిరత్నం తదితరులు

కుప్పం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార మండలి (రెస్కో) పాలకమండలి ప్రమాణ స్వీకారం గురువారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి రెస్కో చైర్మన్ ప్రతాప్, 13 మంది సభ్యులు స్థానిక శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కుప్పం చెరువుకట్టనుంచి టీడీపీ ప్రచార వాహనంపై ఊరేగింపుగా బయల్దేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు అలంకరించిన వాహనాలు సాగుతుండగా ప్రజలకు అభివాదం చేస్తూ పయనించారు. ఈ వాహనాలకు ముందుగా మూడు పార్టీల జెండాలు పట్టుకున్న అభిమానులు, కార్యకర్తల కోలాహలంతో వీధులు నిండిపోయాయి.ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి ఘటించిన పాలకమండలి, అనంతరం అక్కడే నిర్మించిన సభా వేదికను అధిష్టించింది. రెస్కో చైర్మన్‌గా వీజీ.ప్రతాప్, సభ్యులుగా ఆర్ముగం, పి.శివ, ఎన్ఎస్.తులసీనాథ్, సి.మురళి, హరోహరన్, జీఎస్.అనసూయ, బసవరాజు, ఆర్.శరణ్‌కుమార్, మునివెంకటప్ప, ఎం.బాలగంగాధర్, అమీర్ బాషా, ఎన్.విజయకుమార్, పి.సతీశ్‌ల చేత ఎండీ సోమశేఖర్ ప్రమాణం చేయించారు. అనంతరం చైర్మన్ ప్రతాప్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో తనకు పదవి దక్కిందన్నారు.తనను ప్రోత్సహించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు,టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మేలు జన్మలో మరచిపోనన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ జనంలో ఉండి, వారి కష్టసుఖాలను పంచుకునేవారికే పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, కుప్పం మున్సిపల్, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల టీడీపీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె వివాహ విషయంలో మనస్తాపం భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలియకుండా తమ కుమార్తె ఓ వివాహితుడిని వివాహం చేసుకోవడంతో తల్లిదండ్రులు బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు... పుంగనూరు మండలం మాగాండ్లపల్లెకు చెందిన శ్రీరాములురెడ్డికి కుమారుడు సూర్యవర్ధన్‌రెడ్డి, కుమార్తె స్వప్న ఉన్నారు. కుమారుడు రెండేళ్ల క్రితం బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమార్తె స్వప్నను ఎంబీఏ వరకు చదివించారు. స్వప్న తిరుపతిలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. బెంగళూరులో మంజునాథ్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతంలో వివాహం కాగా భార్యకు విడాకులు ఇచ్చి స్వప్నతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ వివాహం చేసుకొని బుధవారం పుంగనూరు సీఐ సుబ్బరాయుడు వద్దకు వచ్చి తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. దీంతో సీఐ మాగాండ్లపల్లెకు చెందిన స్వప్న తల్లిదండ్రులు శ్రీరాములరెడ్డి, మంజులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడగా తన ఇష్టప్రకారమే పెళ్లి చేసుకున్నామని స్వప్న తల్లిదండ్రులకు చెప్పింది. తమకు ఏమాత్రం చెప్పకుండా వివాహితుడిని పెళ్లి చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిందని స్వప్న తల్లిదండ్రులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఉన్న కుమారుడు మృతిచెందగా కుమార్తె ఇలాంటి పని చేయడం జీర్ణించుకోలేక తల్లిదండ్రులు శ్రీరాములురెడ్డి, మంజుల ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన స్థానికులు ఇంటి తలుపులు కొట్టి వారిని కాపాడి చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గురువులే భవిష్యత్ నిర్మాతలు



కేపీఎస్‌లో ఆటలాడుతున్న ఉపాధ్యాయులు

కుప్పం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తరాలను నిర్మించేది గురువులే నని బీసీఎన్ విద్యా సంస్థల అనుబంధమైన కుప్పం పబ్లిక్ స్కూల్ చైర్‌పర్సన్ శాంత నాగరాజ్ అన్నారు. కేపీఎస్‌లో గురువారం ముందస్తు గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గురువులను సన్మానించారు. వారికి పలు అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులు గురువులను పూజించి సత్కరించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గురువుల గొప్పదనాన్ని చాటిచెప్పారు. చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ మాట్లాడుతూ ఆధునిక తరాన్ని చక్కని పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందన్నారు. వారు శిలను శిల్పంగా మలిచే నైపుణ్యశీలురని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.దమయంతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెస్కో పాలకమండలి ప్రమాణ స్వీకారంలో శాంతిపురం, రామకుప్పం నాయకులు



ప్రతాప్‌ను సన్మానిస్తున్న శాంతిపురం టీడీపీ నేతలు

శాంతిపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కో పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలకు శాంతిపురం మండల తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడుల ఆధ్వర్యంలో మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మండలం నుంచి రెస్కో పాలకమండలి సభ్యులుగా ఎన్నికైన అనసూయ, బసవరాజు, శరవణకుమార్(చలపతి)లను ఘనంగా సన్మానించారు. కుప్పంలో జరిగిన రెస్కో పాలకమండలి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి తరలి వెళ్లారు. రెస్కో చైర్మన్ ప్రతాప్‌ను కలిసి సన్మానించారు.

రామకుప్పం నుంచి తరలిన నాయకులు



రెస్కో వైస్‌చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న విశ్వనాథ్

● **రామకుప్పం:** కుప్పం గ్రామీణ సహకార విద్యుత్ సంస్థ (రెస్కో) పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణల ఆధ్వర్యంలో రామకుప్పం మండలం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లెకు చెందిన తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ రెస్కో వైస్‌చైర్మన్‌గా, కొళ్ళపల్లె, గడ్డూరు గ్రామాలకు చెందిన యువనేతలు విజయ్‌కుమార్, సతీష్‌లు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నేతలు కార్యకర్తలు వారిని పూమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా గణనాథుడి నిమజ్జనం



గణనాథుడి నిమజ్జనంలో పాల్గొన్న యువత

శాంతిపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు గ్రామంలో గురువారం గణనాథుడి నిమజ్జనం వేడుకలు గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు. సాయంత్రం చెరువులో గణనాథుడుడి నిమజ్జనం చేశారు. యువకులు, గ్రామస్తులు నిమజ్జనం వేడుకలలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



అమరనాథరెడ్డిని కలిసి సన్మానిస్తున్న రంగనాథ్, గజేంద్ర

పలమనేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని గురువారం స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన వి.కోట మండలానికి చెందిన రంగనాథ్, గజేంద్ర కలిసి శాలువతో సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరుగా వి.కోట మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్‌ను, అదే మండలానికి చెందిన గజేంద్రను ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించడంతో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంబాబు, మురుగేష్, చంద్రశేఖర్‌రెడ్డి, హరి, ఆనంద, వెంకటేష్, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు వైద్యసేవలు



సదుం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ సిబ్బంది గురువారం నడిగడ్డలోని రేషన్ గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీలకు ఉచితగా వైద్య సేవలు నిర్వహించారు. గుండె సంబంధిత, రక్తహీనత, బీపీ, షుగర్ తదితర పరీక్షలతోపాటు సీజనల్ వ్యాధులు, జాగ్రత్తలు, నివారణ అంశాలను వివరించారు. అలాగే గ్రామంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి చరణ్, ఆరోగ్య పరిరక్షణ సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మనీషా, రషీద్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



పుంగనూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పుంగనూరులో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గురువారం స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో మహిళా ఉపాధ్యాయులకు రన్నింగ్, స్లోవాకింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, త్రోబాల్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ప్రోత్సాహక బహుమతులు అందివ్వనున్నట్లు ఎంఈవో నటరాజరెడ్డి తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



రత్నారెడ్డిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు

పలమనేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల సీపీడీసీ సభ్యులు, పారిశ్రామిక వేత్త రత్నారెడ్డి సూచించారు. గురువారం ఆయన కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతోందని .. విద్యార్థులు ఇప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సీపీడీసీ కార్యదర్శి శ్రీపురం సీతారామయ్య కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం. వెంకటేశులు మాట్లాడుతూ కళాశాల కోసం రత్నారెడ్డి కుటుంబం అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో రత్నారెడ్డిని శాలువ కప్పి సన్మానించారు.

హంద్రీ-నీవాపై తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు

కుప్పం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలపై తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కుప్పం డీఎస్పీ పార్థసారథి హెచ్చరించారు. హంద్రీ-నీవా కాలువలో నీళ్లు ఆపేశారంటూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో కొందరు దుష్ప్రచారం చేశారన్నారు. ఇటువంటి అసత్య ప్రచారంతో ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి చెడ్డపేరు తీసుకు రావాలన్న దురుద్దేశం కనిపిస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందే రీతిలో, వర్గాల మధ్య వైషమ్యాలు రగిల్చేలా అసత్య ప్రచారాలు ప్రచురించిన రామ్ అట్‌ది రేట్ ఆఫ్ వైఎస్‌జె-45 అనే వైసీపీకి చెందిన సోషల్ మీడియాపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రజలు తప్పుడు వార్తను గురించి నిజనిర్ధారణ చేసుకోవాలని ఆయన సూచించారు.

హమాలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



హమాలీని పరీక్షిస్తున్న డాక్టర్ సురేఖ

పలమనేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అర్బన్ ఆరోగ్య కేంద్రం అధినేత డాక్టర్ సురేఖ సూచించారు. గురువారం పలమనేరులోని సివిల్‌సప్లై గోడౌన్‌లో పనిచేసే హమాలీల కోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ సురేఖ హమాలీలకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు భారతి, ఫార్మాసిస్టు నిరుపమ, ల్యాబ్ టెక్నిషియన్ దీపా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

పలమనేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం పలమనేరులోని సంఘ సేవకులు శ్రీపురం సీతారామయ్య స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

● **సదుం:** సమాజంలో ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి అని సదుం ఎంఈవో సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం , తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాము

పుంగనూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని మేలుపట్ల, పుంగమ్మ చెరువులు ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దళిత సంఘ నాయకులు ఆరోపించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్‌కమిటీ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు, దళితనేతలు అశోక్‌కుమార్, నరసింహలు, కృపాకర్‌లు మాట్లాడుతూ భూముల విలువలు పెరుగుతుండటంతో చెరువుల ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంపై మూడు నెలలుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ప్రయోజనం లేదని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారులపై చెప్పడం, ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ అధికారులపై చెప్పడం తప్ప సమస్య పరిష్కారం జగరలేదన్నారు. రాజన్న, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి నెల జరిగే ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మునీంద్రనాయక్ మాట్లాడుతూ ఎస్టీ గురుకుల పాఠశాలకు జిల్లా కలెక్టర్ 5 ఎకరాల స్థలాన్ని కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ హరిప్రసాద్, మున్సిపల్ డీఈ మహేశ్, ఏవో రెడ్డెమ్మ, దళితసంఘనాయకులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై రేపు శిక్షణ

కల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, మండల పరిషత్ పరిపాలనా అధికారి మునిరాజ తెలిపారు. అన్నిశాఖల ఏఈలు, ఏపీఎం, ఏపీవో, ఎంఏవో, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, పశువైద్యాధికారి, కార్యదర్శులు హాజరుకావాలని వారు కోరారు.

అద్దె భవనాల్లో అగచాట్లు..!

● అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు ● అంతంతమాత్రం సౌకర్యాలతో పిల్లల అవస్థలు



పెద్దపంజాణి మండలం కెలవాతి, మల్లసముద్రం గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు

పలమనే రు, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసి ఏళ్ల గడిచిపోతున్నా నేటికి భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అద్దెభవనాల్లో అగచాట్లు పడుతున్నారు. రాజకీయ అండ ఉన్న కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన నూతన భవన నిర్మాణాలకు కాంట్రాక్టు తీసుకొని నిర్మాణాలు చేపట్టారు. అయితే అర్ధంతరంగా నిర్మాణాలు నిలిపేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసిన భవన నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన అధికారులు ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పలు భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోనే కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది.

● **పలమనేరు మండలంలో :** పలమనేరు మండలంలో 79 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో పలమనేరు అర్బన్ సెక్టార్‌లో 20 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 5 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఒక భవనం పాఠశాల ఆవరణలోను.. మరో 14 అద్దె భవనాల్లో తలదాచుకుంటున్నాయి. అర్బన్ లోని గంటాఊరుకు ప్రభుత్వం మంజూరు చేసిన అంగన్ వాడీ కేంద్ర భవనం అర్ధంతరంగా నిర్మాణం ఆగిపోయింది. ఇక పలమనేరు రూరల్‌లో 24 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. ఇందులో 13 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 5 ఉచిత భవనాల్లో నడుస్తుండగా.. మిగిలిన 6 కేంద్రాలు అద్దె భవనాల్లో తలదాచుకుంటున్నాయి. ఈ సెక్టార్‌లోని పందేరుపల్లి, ఊసరపెంట గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన భవనాలు అసంపూర్తిగా నిర్మాణాలు నిలిచిపోయాయి. పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి సెక్టార్‌లో 25 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 13 కేంద్రాలకు సొంత భవనాలుండగా 5 కేంద్రాలు ఉచిత భవనాల్లో నడుపుతున్నారు. మిగిలిన 7 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ సెక్టార్‌లో ముసలిమడుగు, మాదిగబండ, దిగువమారుమూరు, ఎస్ఆర్‌పురం , టి. ఒడ్డూరు గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిపేశారు.

● **గంగవరం మండలంలో :** గంగవరం మండలంలో మొత్తం 79 అంగన్ వాడీ కేంద్రాలుండగా 5 సొంత భవనాల్లోనూ, 9 కేంద్రాలు ఉచిత భవనాల్లోను, మరో 11 కేంద్రాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. గంగవరం సెక్టార్‌లోని శ్రీలంకకాలనీ, నల్లగుట్లపల్లి, డి. కురప్పల్లి గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన అంగన్‌వాడీ కేంద్ర భవానాల నిర్మాణాలు నిలిచిపోయాయి. మండలంలోని సామరాజుపల్లి సెక్టార్‌లో 29 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 14 కేంద్రాలు సొంత భవనాల్లో, 8 ఉచిత భవనాల్లో, మరో 7 కేంద్రాలు అద్దెభవనాల్లో ఉన్నాయి. సెక్టార్‌లోని కల్లుపల్లి, గాంధీనగర్, మాదిగపల్లి గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని పసుపత్తూరు సెక్టార్‌లో 25 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 7 కేంద్రాలు సొంత భవనాల్లోను, 10 ఉచిత భవనాల్లోను, 8 అద్దెభవనాల్లో తలదాచుకుంటున్నాయి. ఈ సెక్టార్‌లో పవుపత్తూరు, గొర్రెలదొడ్డి, గోవిందశెట్టిపల్లి, పత్తికొండ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరుచేసిన అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

● **పెద్దపంజాణి మండలంలో :** పెద్దపంజాణి మండలంలో మొత్తం 76 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పెద్దపంజాణి సెక్టార్‌లో 25 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 14 కేంద్రాలు సొంత భవనాల్లోను, 5 ఉచిత భవనాల్లో ఉన్నాయి. 6 అద్దెభవనాల్లో తలదాచుకుంటున్నాయి. ఈ సెక్టార్‌లో లింగాపురం, జంగాలపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఎస్.ఆర్.పేట సెక్టార్‌లో 25 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఇందులో 15 సొంత భవనాల్లోను, 8 ఉచిత భవనాల్లోను, 2 అద్దెభవనాల్లో తలదాచుకొంటున్నాయి. ఈసెక్టార్‌లో ఓబులాపురం, నెర్నిపల్లి, చింతలపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. రాయపేట సెక్టార్‌లో 26 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఇందులో 12 సొంత భవనాల్లోను, 6 ఉచిత భవనాల్లోను, మరో 8 అద్దెభవనాల్లో ఉన్నాయి. ఈ సెక్టార్‌లోని కెళవాతి, మల్లసముద్రం గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి.

2019కి ముందు మంజూరు చేసిన భవనాలే ఎక్కువ

పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2019 కి ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మంజూరుచేసిన భవనాలే 90 శాతం పైగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైనా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేయించేందుకు చొరవ తీసుకోక పోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మళ్లీ తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేయించడంతో పాటు అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్ వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రాళ్ళబూదుగూరును పర్యాటక కేంద్రంగా మారుస్తాం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ , మాట్లాడుతున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం

శాంతిపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాళ్ళబూదుగూరును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నివిధాలా కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. గురువారం రాళ్ళబూదుగూరు గ్రామంలో వెలసిన కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వందేళ్ల ఆలయ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.7.88 కోట్లు మంజూరు చేశారన్నారు. సంవత్సర కాలంలో పనులు పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా కుంభాభిషేకం వేడుకలను నిర్వహిస్తామన్నారు. అందకుగాను రూ.11లక్షల చెక్కును ఆలయ ధర్మకర్త ప్రశాంత్‌కు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్ మునిరత్నంలు అందించారు. అంతే కాకుండా రాళ్ళబూదుగూరును త్వరలోనే మండలంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రానున్న 2029 నాటికి రాళ్ళబూదుగూరు పర్యాటక కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఇలా నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాలను, చిన్న చిన్న గ్రామ దేవతల ఆలయాలను అభివృద్ధి పరచడానికి కోట్లాది రూపాయలు సీఎం మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు, సింగల్ విండో చైర్మన్ గోపాల్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, రాళ్ళబూదుగూరు క్లస్టర్ ఇంచార్జి పీవీ నాగరాజు, ఏఎంసీ చైర్మన్ జీఎం రాజు, తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ రవిచంద్రబాబు, రెస్కో డైరెక్టరు బసవరాజు, యూనిట్ ఇంచార్జిలు ఆర్ఎస్ మణి, గిరిధర్, పెద్దన్న, అంజనేయరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్‌లు శ్యామల, హరినాథరెడ్డి, రాళ్ళబూదుగూరు పంచాయతీ పార్టీ అధ్యక్షులు జయరాజ్, నేతలు కుమార్, క్యాబేజి మురళీ, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ జెండా గల్లంతు



సోమల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న భూషన్ రాయల్

సోమల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల- తిరుపతి ప్రధాన రహదారిలోని సూరయ్యగారిపల్లె వద్ద జనసేనపార్టీ అభిమా నులు ఏర్పాటు చేసిన పార్టీ జెండాను దుండ గులు తీసివేయడంతో గురువారం ఆపార్టీ మం డల అధ్యక్షుడు భూషన్ రాయల్ పార్టీ కా ర్యకర్తలతో కలిసి సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల జిల్లా పార్టీ అధ్యక్షుడు హరిప్రసాద్ పార్టీ జెండాను జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జెండాను గల్లంతు చేసిన వారిని పోలీసులు గుర్తించి న్యాయం చేయాలని కార్యకర్తలు కోరారు. ఏఎంసీ డైరెక్టర్ మురళీ, మనోజ్‌కుమార్, రామకృష్ణ, అభిషేక్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కృష్ణానాయక్



రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసులును కలిసిన కృష్ణానాయక్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసులు, మేనేజింగ్ డైరెక్టర్ మణికుమార్‌లను డైరెక్టర్ కృష్ణానాయక్ కలిశారు. గురువారం విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో పుంగనూరు మండలం సుగాలిమిట్టకు చెందిన ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ పుంగనూరు ప్రాంతంలో అధికంగా గిరిజనులు ఉన్నారని, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి సహాయ సహకారాలు అందివ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు రామకృష్ణనాయక్ తదితరులు వెళ్లారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకం

కల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని తహసీల్దార్ జయసింహ తెలిపారు. మండలానికి 12,048 స్మార్ట్ రేషన్ కార్డులు రావడంతో గురువారం సాయంత్రానికి 6755 కార్డులు లబ్ధిదారులకు అందజేసిట్లు పేర్కొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమి గెలుపు: పెద్దిరెడ్డి

సదుం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎం ట్యాంపరింగ్‌తోనే కూటమి పార్టీల గెలుపు సాధ్యమైందని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. తన స్వగ్రామం ఎర్రాతివారిపల్లెలో గురువారం మండల వైసీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సూచనలు చేశారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు వైద్యపరీక్షలు



సీజనల్ వ్యాధులు, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న బాలు

రామకుప్పం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గురువారం స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షల అనంతరం వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే సీజనల్ వ్యాదులు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యాలయం ప్రత్యేకాధికారి అమరావతి, హెల్త్ అసిస్టెంట్ బాలు, హెచ్ఈ ప్రమీళ, ఏఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు వేణమ్మ, రాణెమ్మ లు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ నేతల భారీ ర్యాలీ



గంగాధరనెల్లూరులో నిర్వహించిన ర్యాలీలో ప్రత్యేక వాహనంపై వెళుతున్న ప్రభుత్వవిప్ థామస్, ఏఎంసీ చైర్మన్ కృష్ణమనాయుడు, డైరెక్టర్లు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గంగాధరనెల్లూరులో ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్, పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, డైరెక్టర్లు కలిసి సుమారు 300 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణా స్వీకార కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం గంగాధరనెల్లూరు అల్లియెల్లమ్మ గుడిలో థామస్, కృష్ణమనాయుడు, డైరక్టర్లతో పాటు నేతలు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తర్వాత వారు ప్రత్యేకంగా అలంకరించిన వ్యాన్‌పై ఎక్కి గంగాధరనెల్లూరులో ర్యాలీ నిర్వహించగా, బస్టాప్ కూడలిలో టీడీపీనేతలు భారీ గజమాలను క్రేన్‌తో వేసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా టపాసుల మోతలతో మార్మోమోగింది. అనంతరం వారు చిత్తూరు నగరానికి కార్లతో ర్యాలీగా వెళ్ళారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుల్‌నాథన్, డైరక్టర్లు కామసాని కోదండరెడ్డి, నియాజ్ అలీ, దేవరాజు, గ్రీష్మ, దేవరాజు, లోకమ్మ, లెక్కలపూడి అరుణ, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ బాబు నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, నేతలు దేవసుందరం, మోహన్‌నాయుడు, రాంబాబురెడ్డి, శివప్రసాద్, హరీష్‌యాదవ్, పాచిగుంట రఘునాథ నాయుడు, వర్రా యువరాజారెడ్డి, పొదిలి వినోద్ నాయుడు, బీజేపీ నేతలు మణివర్మ, రాజేంద్రన్, ఇడగట్టి సుధాకర్, ఆనంద్ బాబు, జనసేన నేతలు సురేష్‌రెడ్డి, శ్రీలతారెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణోత్సవం



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో గురువారం శివపార్వతుల కళ్యాణం కమనీయంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, శైవాచారంలో శివపార్వతులకు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అక్షింతలు, తలంబ్రాలు అందజేశారు. ఉభయదారులు, నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులకు పనులు కల్పించాలి



పండ్ల మొక్కలను నాటుతున్న ఏపీడీ మల్లిఖార్జున్

తవణంపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ఉపాధి హామి శ్రామికులకు పనులు కల్పించాలని ఏపీడీ మల్లిఖార్జున్ సిబ్బందికి సూచించారు. మండలంలోని టి.పుత్తూరు పంచాయతీ పరిధిలోని సిద్ధేశ్వరకొండ గుడి పరిసరాలు, బోడిగుట్టపై చెట్లు నాటే పథకం కింద గురువారం 1,600 పండ్ల మొక్కలను నాటారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపీడీ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు పండ్ల తోటల పెంపకం పనులు పూర్తి చేయాలన్నారు. గోకులాల నిర్మాణంపై సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఏపీవో బాల, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల హక్కుల కోసం నిరంతర పోరాటం

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతుల హక్కుల కోసం నిరంతర పోరాడుతూనే ఉంటామని, రైతుల సమస్యల పరిష్కారమే తమ తొలి ప్రాధాన్యమని జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కృపాలక్ష్మి అన్నారు. గురువారం పుత్తూరులోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆమె జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 9న రైతులతో కలసి చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి కోసం మహిళల ధర్నా



నింద్ర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్‌కు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్దకు విచ్చేసిన వారు మంచినీటి సరఫరా జరగడం లేదంటూ ఆందోళనకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై కూర్చుని వాహనాల రాకపోకలను ఆపేశారు. తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు రోడ్డుపై నుంచి లేవమంటూ ధర్నా చేస్తూ భీష్మించుకు కూర్చున్నారు. మున్సిపల్ నీటి సరఫరా సిబ్బంది వారించినా నిరసన కారులు శాంతించలేదు. దీనిపై నిరసన కారులు మాట్లాడుతూ తమ ప్రాంతానికి తాగునీరు సరఫరా పది రోజులుగా లేదని, ఎలా జీవించాలన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. తాగునీరు సరఫరా చేసే రెండు మోటార్‌లలో ఒకటి తరచూ మరమ్మతులకు గురవుతోందని, అందుకే ఇలాంటి సమస్య వచ్చిందని అధికారులు తెలుపుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన శేఖర్ బాబు



శేఖర్‌బాబు (ఫైల్‌ఫొటో)

తవణంపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన బి.శేఖర్ బాబు(54) సొంత పనుల నిమిత్తం ఐరాల క్రాస్ రోడ్డుకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా బెంగళూరు-తిరుపతి హైవే సర్వీస్ రోడ్డులో తెల్లగుండ్లపల్లె గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు కనుగొని బంధువులకు సమాచారం అందించారు. మృతుడు స్థానికంగా జాతీయ ఉపాధి హామి పథకంలో సీనియర్ మేట్‌గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి మృతి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి నగరంలో చోటుచేసుకుంది. నగరి మున్సిపాలిటీ సత్యవాడకు చెందిన దేవరాజ్ (28) ఓ ప్రైవేట్ పాల ఫ్యాక్టరీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. పనుల నిమిత్తం బుధవారం చిత్తూరుకు వచ్చాడు. పనులు ముగించుకొని ఓవర్ బ్రిడ్జిపై ద్విచక్ర వాహనంలో ఆర్టీసీ బస్టాండ్‌కు వెళుతుండగా.. వెనుకనే వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దేవరాజ్‌ను స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి చనిపోయాడు. గురువారం ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించారు.

విద్యుత్ కార్మికులకు భద్రత కల్పించాలి

నింద్ర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరి విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో పని చేసే కార్మికులకు భద్రత కల్పించాలని కార్మికుల యూనియన్ నాయకులు గురువారం నగరి డీఎస్పీ సయ్యద్ అజీజ్ అహ్మద్‌ని కలసి వినతిపత్రం సమర్పించారు. డీఎస్పీ తక్షణమే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మూర్తివర్మ, సుధాకర్, హరి యాదవ్, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడి అరెస్టు

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక(11)పై అత్యాచార యత్నం కేసులో నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ ఎస్.హనుమంతప్ప, ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలకు ప్రయత్నిస్తే రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. అత్యాచార యత్నానికి పాల్పడితే పోలీసులకు ఫిర్యాదుచేయాలన్నారు.

ముందస్తు గురుపూజోత్సవం

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంచి సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర చాలా విశిష్టమైనదని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి అన్నారు. గురువారం ఆ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో ముందస్తుగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు లత, సుబ్బారావు, హరిబాబు, బాబు, భార్గవి పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమాచక్రవర్తి గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను డీఈవో సాగర్‌బాబు అందించారు.

నేడు కర్ణాటక హైకోర్టు జడ్జి రాక

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి ఈ.ఎస్.ఇందిరేష్ శుక్రవారం జిల్లాలో పర్యటించేందుకు వస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్జి బెంగళూరు నుంచి కారులో బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు కాణిపాకం చేరుకొని అతిథిగృహంలో బసచేస్తారు. అనంతరం స్వయంభు కాణిపాక వినాయకస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, దైవదర్శనం చేసుకుంటారు. కొద్దిసేపు విరామం అనంతరం ఆయన తిరుమలకు బయలుదేరి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పులిగుండులో పౌర్ణమి వేడుకలు రద్దు

పెనుమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిగుండు శివాలయం వద్ద ఈ నెల 7వ తేదీ ఆదివారం పౌర్ణమి వేడుకలు రద్దుచేసినట్లు నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆ రోజు చంద్ర గ్రహణం కారణంగా ఆలయం మూతవేస్తున్నందున, గిరిప్రదక్షిణ, అన్నదాన కార్యక్రమాలను రద్దుచేస్తున్నామని తెలిపారు. ఈ కారణంగా భక్తులు ఎవరు పౌర్ణమి రోజున పులిగుండు ఆలయానికి రావద్దని వారు విన్నవించారు.

ప్రవాసాంధ్రులూ... చిత్తూరు అభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపు



ప్రమాణస్వీకారం చేస్తున్న టౌన్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశవిదేశాల్లో స్థిరనివాసాలు ఏర్పరచుకున్న చిత్తూరు వాసులు వెనక్కివచ్చి నగర అభివృద్ధికి తమవంతుగా సహకరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ మీటింగ్ హాలులో చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకులన్నీ నష్టాలఊబిలో ఇరుక్కోగా, చిత్తూరు టౌన్ బ్యాంకు మాత్రమే లాభాల దిశలో ఉండడం ఆనందం కలిగిస్తోందన్నారు. చిత్తూరు టౌన్‌బ్యాంకు చైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి పాల్పడకుండా నిజాయితీగా పనిచేస్తూ టీడీపీకి, ఇటు టౌన్ బ్యాంకు చైర్మన్ పదవికి న్యాయం చేస్తానన్నారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. టౌన్ బ్యాంకు సిబ్బంది న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తొలుత బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో సుమతి స్వాగతం పలుకుతూ టౌన్ బ్యాంకు ప్రగతిని వివరించారు. అనంతరం బ్యాంకు చైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు, డైరెక్టర్లుగా డి.బాబు రెడ్డి, టి.సురేష్ బాబు, ఎ.అన్సర్, జి.నరసింహులుచే పదవీ ప్రమాణస్వీకారాన్ని ఎమ్మెల్యే చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, సీనియర్ టీడీపీ నాయకులను బ్యాంకు చైర్మన్ రమేష్ నాయుడు శాలువా కప్పి సత్కరించారు. నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, సీనియర్ టీడీపీ నాయకులు ఎస్.చంద్రప్రకాష్, వెంకటేష్, వి.కె.వసంత్ కుమార్, జయచంద్ర నాయుడు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంటీ త్యాగరాజన్, జనసేన నేత ఆరణి కవిత, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు. పలువురు అభిమానులు బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లను ఘనంగా సత్కరించారు.

ఉచిత బస్ ఎఫెక్ట్

● బస్సుల్లో రద్దీ.. అదనపు సర్వీసు నడపాలని డిమాండ్



బస్సు కిందనే నిల్చిపోయిన విద్యార్థులు, ప్రజలు

గుడిపాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడాన్ని అమలుచేయడంతో రోజు రోజుకీ ప్రయాణికుల సంఖ్య పెరగడంతో అదనంగా బస్సు సర్వీసును నడపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని రెట్టకుంట, కుప్పిగానిపల్లె, కృష్ణ జిమ్మాపురం, కమ్మతిమ్మాపల్లె, 197 రామాపురం, ఏఎల్‌పురం గ్రామాల మీదుగా ఉదయం 7 గంటలకు చిత్తూరుకు చేరుకునే విధంగా అధికారులు చర్యలు చేపడితే ఇటు రైతులకు అటు విద్యార్థులకు, వ్యాపారులకు సౌకర్యంగా ఉంటుందని కోరుతున్నారు.

ఆ ఇద్దరికీ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



చంద్రశేఖర్, జ్యోతి

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి కార్వేటినగరం గుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ ఆటుకారు చంద్రశేఖర్ ఎంపికయ్యారు. ఇదే మండలంలోని పాదిరికుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో కె.జ్యోతి ఎంపికయ్యారు. వీరికి ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి బి.మోహన్‌యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి తన్నీరు యువరాజు, సంఘ నాయకులు గురువారం అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



టీచరును సత్కరిస్తున్న ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పద్మావతి

వెదురుకుప్పం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్ తన్నీరు యువరాజును గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ పద్మావతి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్ బాధ్యతల స్వీకరణ



సింగిల్‌విండో చైర్మన్ నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న జయశంకర్ నాయుడు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండల సింగిల్‌విండో నూతన చైర్మన్‌గా నిరంజన్‌రెడ్డి గురువారం వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టరుగా పూజారి నాగరాజు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, పార్టీ శ్రేణులు నిరంజన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతలు పుల్లూరు బాబు, జలందర్ నాయుడు, భూపతి రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కి పూతలపట్టు బీజేపీ అధ్యక్షుడు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రసాద్

పూతలపట్టు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించాడు. ఎల్ఐసీ తరఫున ఈ ఏడాది జనవరి 20న నిర్వహించిన మ్యాడ్ డే రోజున 24 గంటల్లో ఎక్కువ ఎల్ఐసీ పాలసీలు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించాడు. ఈ సందర్భంగా ఎల్ఐసీ తరఫున చిత్తూరు బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డిలు ప్రసాద్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

సోలార్ ప్రాజెక్ట్‌కు స్థలపరిశీలన

పూతలపట్టు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సోలార్ ప్రాజెక్టుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. మండలంలోని తేనేపల్లి పంచాయతీ పరిధిలో వున్న పెద్దగుట్ట వద్ద నెడ్‌క్యాప్ ప్రతినిధులు ప్రభుత్వ సహకారంతో సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. దీనిపై చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ రమేష్ బాబు గత రెండ్రోజులుగా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. గురువారం సాయంత్రం తహసీల్దార్‌తో కలిసి ఆర్డీవో పెద్దగుట్టను పరిశీలించారు. తహసీల్దార్ రమేష్‌బాబు ఇప్పటికే రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సోలార్ ప్రాజెక్టుకు సహకరించాలని కోరారు.

టీడీపీ అధ్యక్షుడికి సన్మానం



సుబ్రహ్మణ్యానాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు, టీడీపీ నేతలు

గుడిపాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రెండోసారి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎంపికైన చలిచీమల సుబ్రహ్మణ్యం నాయుడిని పలువురు నేతలు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గురువారం మండలంలోని ఏఎల్‌పురంలో సర్పంచ్ గుర్రప్ప నాయుడు, టీడీపీ నేతలు విజయా నాయుడు, రెడ్డప్ప, దామోదరం, చిట్టిబాబు, గ్రామపెద్దలు భారీ కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించారు.

అర్ధగిరి పాలక మండలికి దరఖాస్తుల ఆహ్వానం

తవణంపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరగొండ అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానం నూతన పాలక మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం కోరుతూ దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈవో హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలక మండలిలో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారని, ఆసక్తి గల ఎస్సీ, బీసీ, ఓసీ అభ్యర్థులు ఈ నెల 20వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని ఈవో తెలిపారు.

వైభవంగా కాళికమ్మ ఆలయ కుంభాభిషేకం



కండ్రిగ దళితవాడ ఆలయంలో ప్రతిష్ఠించిన కాళికమ్మ, పట్టువస్త్రాలతో ఆలయానికి వస్తున్న ఆలయకమిటీ సభ్యులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూగుండ్రం పంచాయతీ కండ్రిగ దళితవాడలోని కాళికమ్మ ఆలయ కుంభాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. గురువారం యాగశాల పూజలు, మహాపూర్ణాహుతి, కలశపూజలను అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. భక్తులకు ఆలయకమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

మాజీ మంత్రికి జాతర కమిటీ ఆహ్వానం

నింద్ర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలో నిర్వహించే గంగజాతర ఉత్సవాలకు జాతర కమిటీ సభ్యులు గురువారం మాజీ మంత్రి రోజాను ఆహ్వానించారు. గ్రామదేవతల ఉత్సవాలకు చీర, సారెను గంగజాతర కమిటీ వారికి ఆమె అందించారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, జాతర నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మదన శ్రీనివాసన్, కోలా బాలాజీ, శంకర్, రాజేష్, ధన, మహేష్, ఎల్లప్పరెడ్డి, తిరుమలరెడ్డి, రవి, దామునాయుడు, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తమ ప్రత్యర్థుల నుంచి ప్రాణ హాని ఉందని, వారి నుంచి తనకు రక్షణ కల్పించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి పంచాయతీ వేణుగోపాలపురం వడ్డి ఇండ్లకు చెందిన కె.గోపాల్ కుమారుడు కే.రాజవేలు వెదురుకుప్పం పోలీసులకు గురువారం విజ్ఞప్తి చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం. తాను ఇదే మండలంలోని మొరవ గ్రామంలో గురువారం ఉదయం 10 గంటల సమయంలో టిఫిన్ అంగడి వద్ద ఉండగా తమ గ్రామానికి చెందిన పి.సిద్ధయ్య కుమారుడు పి.కన్నయ్యతో పాటు అతడి కుమారుడు పి.రమేష్ ఇద్దరూ కలసి తనపై దాడికి పాల్పడినట్లు చెప్పారు. గతంలో కూడా తనపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రాజవేలు తెలిపారు.

మార్కెట్‌కమిటీ ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

పాలసముద్రం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మార్కెట్‌కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి గురువారం పాలసముద్రం మండలంనుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. పాలసముద్రం మండలం ఆముదాల గ్రామానికి చెందిన అరుళ్‌నాథన్‌కు పెనుమూరు మార్కెట్‌కమిటీ పాలకవర్గంలో వైస్‌చైర్మన్ పదవి ఇవ్వడంతో ఇక్కడి నాయకులు మండలంలోని అన్ని పంచాయతీల నుంచి కార్లు, సుమోలు, వ్యాన్లలో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్లూరు శివా నాయుడు, శేఖర్‌రాజు, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ అరుళ్‌నాధన్, సాంబశివన్, శ్రీనురాజు, రమేష్, మోహన్‌రాజు, బాలాజి నాయుడు, కార్యకర్తలు తరలివెళ్లారు.

ఘనంగా గణేశుడి పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంగనపల్లెలో గురువారం స్థానిక యువత ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ మంటపంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పూజలుచేసి ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు.

హమాలీలకు వైద్యసేవలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట రైస్ గోదాములోని హమాలీ వర్కర్లకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పీవీ భువనేశ్వరి తెలిపారు. గురువారం ఆర్కేవీబీపేటలో ప్రత్యేక శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించామని ఆమె పేర్కొన్నారు.

7న సాయంత్రం నుంచి వరసిద్ధుడి ఆలయం మూసివేత

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీ చంద్రగ్రహణం కారణంగా కాణిపాకం వరసిద్ధుడి ఆలయంతో పాటు మణికంఠేశ్వరస్వామి ఆలయం, వరదరాజస్వామి ఆలయాలను ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి మూసివేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. గ్రహానంతరం 8వ తేదీ ఉదయం 4 గంటల తర్వాత ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, గ్రహణశాంతి, స్వామికి అభిషేకం నిర్వహించి ఉదయం 6 గంటల నుంచి స్వామి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించనున్నట్లు ఈవో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆలయ ఉభయదారులు, గ్రామస్తులు, భక్తులు గమనించాలని ఈవో కోరారు.

వేగంగా హైరోడ్డు విస్తరణ పనులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఎమ్మెల్యే మార్గనిర్దేశంలో కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇది వరకు ప్రభుత్వ భవనాలను మాత్రమే కూల్చివేసిన నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వారం రోజులుగా ప్రైవేటు భవనాలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో గురువారం దేవి థియేటర్ ప్రహరిగోడ, సత్యషాపింగ్ మాల్ పక్కనే ఉన్న ఎంఎస్ఆర్ థియేటర్ యజమానికి సంబంధించిన దుకాణాలు, ఓ ప్రైవేటు వ్యక్తికి సంబంధించిన భవనాన్ని ఆయన అనుమతితోనే ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. పనులను ఏసీపీ నాగేంద్ర పర్యవేక్షించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలి

పూతలపట్టు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ ఆదేశించారు. గురువారం ఆయన పూతలపట్టు ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.